
సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం । 30 । జూన్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి రామ దివాకర్, శారద రాణి దంపతులు(హైదరాబాద్) గురువారం రూ.50 వేల విరాళం అందజేశారు.



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: ఖరీఫ్ సాగు కోసం కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,130, మధ్య డెల్టాకు 1,530, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
39.5°/26.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	39.5	26.5
కాకినాడ	36.5	28.4
అమలాపురం	36.0	27.0

న్యూస్‌రీల్

పింఛన్ సొమ్ము రూ.64.56 కోట్లు విడుదల

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో 2,34,199 మంది లబ్ధిదారులకు జూలై ఒకటి నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.64.56 కోట్లు విడుదల చేసింది. వలంటీర్లు 1వ తేదీ ఉదయం నుంచే పంపిణీ చేస్తారని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు.

సురక్ష సభల షెడ్యూల్‌ను అప్‌లోడ్ చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జూలై ఒకటి నుంచి నిర్వహించే గ్రామ, వార్డు సభల షెడ్యూల్, వేదిక వివరాలను ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్ల లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 512 గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కింద ఇంటింటి సర్వే ప్రక్రియను సజావుగా పూర్తి చేసి, ఎప్పటికప్పుడు షెడ్యూల్ ప్రకారం టోకెన్లు జారీ చేసి, సర్వీస్ రిక్వెస్ట్ అప్‌డేట్ చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 1,78,225 గృహాలకు గాను 1,06,815 ఇళ్లను సందర్శించారన్నారు. ఇప్పటి వరకూ 7,5113 టోకెన్లు జారీ చేసి 5,7507 సేవా అభ్యర్థనలు రూపొందించారన్నారు. సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలోని వలంటీర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయి టెక్నికల్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని, అందుకు అనుగుణంగా టోకెన్ రైజ్ చేయాలన్నారు.

2న చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో జూలై 2న స్థానిక వైఎంఎ హాల్లో రెపిడ్ అండ్ బ్లిడ్జ్ ఓపెన్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు జూలై 22, 23 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఏపీచెస్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 98483 74133 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రత్నగిరి.. భక్తజనఝరి

- సత్యదేవుని దర్శించిన 60 వేల మంది
- దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రత్నగిరిపై సత్యదేవుని ఆలయం కిటకిటలాడింది. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు భక్తులు స్వామివారి సన్నిధికి వస్తూనే ఉన్నారు. పండితులు ఉదయం ఏడు గంటలకు స్వామివారికి స్వర్ణపుష్పార్చన, ఉదయం 11 గంటలకు తులసి పూజ నిర్వహించారు. ఇటీవల వివాహాలు చేసుకున్న వారు తొలి ఏకాదశి సందర్భంగా తెలుపు వస్త్రాలు ధరించి స్వామివారి సన్నిధికి వచ్చారు. వీరికి సాధారణ భక్తులు తోడవ్వడంతో ఆలయంలో రద్దీ ఏర్పడింది. స్వామివారి దర్శనం క్యూ లైన్లు, ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, విశ్రాంత మండపాలు భక్తులతో నిండిపోయాయి. సుమారు 60 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు ఆరు వేలు జరిగాయి. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, ప్రదక్షిణ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షలు ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో ఐదు వేల మందికి ఉచిత భోజనసౌకర్యం కల్పించారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రతి గడపకూ ప్రగతి



కొవ్వూరు నియోజకవర్గం మద్దూరు గ్రామంలో పూర్తయిన సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణం

> కొవ్వూరు నియోజకవర్గం మద్దూరులో 2,500 మంది జనాభా నివసిస్తోంది. కొన్నేళ్లుగా గ్రామంలో అంతర్గత రహదారులు, మురుగుకాలువలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. మురుగు కాలువ నిర్మించాలని ప్రజలు అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నా మోక్షం కలగలేదు. గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామానికి వెళ్లిన హోం మంత్రి తానేటి వనితకు స్థానికులు తమ సమస్యను వివరించారు. ఆమె వెంటనే స్పందించారు. డ్రెయినేజీ నిర్మాణానికి నాంది పలికారు. రూ.20 లక్షలతో **మూడు సిమెంట్ రోడ్లు, మేజర్ డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపట్టారు.**

> నిడదవోలు నియోజకవర్గం కాపవరంలో 4,200 మంది ఉంటున్నారు. మురుగు కాలువలు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షం కురిస్తే రోడ్డు చెరువును తలపించేది. ఇళ్లల్లోకి నీరు చేరిన పరిస్థితులు లేకపోలేదు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడుకు స్థానికులు ఈ సమస్యను నివేదించారు. ఆయన వెంటనే ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపారు. ఆమె ఆమోద ముద్ర వేయడంతో రూ.20 లక్షలతో ఐదు డ్రెయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు త్వరితగతిన **పూర్తవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.**

- జిల్లాలో విస్తృతంగా 'గడప గడపకూ మన ప్రభుత్వం'
- ప్రతి గడపా తడుతున్న ఎమ్మెల్యేలు
- ప్రజల వినతులకు సత్వర పరిష్కారం
- అభివృద్ధి పనులపై జిల్లా అధికారులకు ప్రతిపాదనలు
- సత్వరం అనుమతులు.. సింహభాగం పూర్తయిన పనులు
- ఎమ్మెల్యేల పర్యవేక్షణతో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి

సాక్షి, రాజమహేంద్రవరం: 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఎమ్మెల్యేలు ప్రతి గడపా తడుతున్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటున్నారు. ప్రజలు ఇచ్చిన వినతులకు సత్వర పరిష్కారం చూపుతున్నారు. ఫలితంగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ప్రజల విజ్ఞప్తులనే ప్రామాణికంగా తీసుకున్న ఎమ్మెల్యేలు, అధికారులు అవసరమైన పనులకు యుద్ధ ప్రాతిపదికన శ్రీకారం చుడుతున్నారు. ప్రధానంగా రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. దీంతో గ్రామాలకు వస్తున్న ఎమ్మెల్యేలకు బ్రహ్మరథం పడుతున్నారు. సమస్యలు పరిష్కారం అవుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విధి విధానాలు

గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఏ పనులకు వినియోగించాలనేది ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. **ఈ మేరకు ఒక్కో పనికి కనిష్ఠంగా రూ.లక్ష, గరిష్ఠంగా రూ.20 లక్షలు చొప్పున ఖర్చు చేసేందుకు విధి విధానాలు రూపొందించారు.**

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా రూ.46.78 కోట్లతో 1,288 పనులు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకుని కలెక్టర్‌కు ప్రతిపాదించారు. అందులో రూ.44.20 కోట్ల అంచనాలతో 1,221 పనులకు కలెక్టర్ ఆమోదముద్ర వేశారు. రూ.39.77 కోట్ల విలువైన 1,149 పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 271 పనులు పూర్తయ్యాయి. అవి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. వీటి బిల్లుల మంజూరు ప్రక్రియ వేగంగా జరుగుతోంది. కొత్త పనులకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారు. అలాగే ప్రజలకు అత్యవసరమైన పనులు చేపడుతున్నారు. రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు. తాగునీటి సరఫరా పైపులైన్లు, **ట్యాంకుల నిర్మాణం, బోర్లు తవ్వడం, సీసీ, బీటీ దారులు, ఇతర కాలువలు, విద్యుత్తు సౌకర్యానికి స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కల్వర్టులు, సామాజిక భవనాలు, ప్రహరీ** గోడలు, వరద నివారణ నిర్మాణ పనులు చేపడుతున్నారు.

జిల్లాలో పనులకు కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)..

మండలం	పనులు	నిధులు	పూర్తయినవి
అనపర్తి	79	2.79	15
బిక్కవోలు	40	1.60	8
దేవరపల్లి	127	4.18	21
గోకవరం	27	0.95	8
గోపాలపురం	124	3.60	10
కొవ్వూరు	41	1.20	20
నల్లజర్ల	134	4.00	20
నిడదవోలు	8	0.40	8
పెరవలి	12	0.40	2
రాజమండ్రి అర్బన్	84	6.89	24
రాజమండ్రి రూరల్	65	2.55	33
రాజానగరం	91	2.36	8
రంగంపేట	107	3.40	50
సీతానగరం	44	1.60	13
తాళ్లపూడి	80	2.20	4

ఎమ్మెల్యేల పర్యవేక్షణ

సచివాలయ పరిధిలో చేపట్టే పనుల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు బృందానికి బాధ్యులుగా ఉంటారు. అధికారులు, ఎమ్మెల్యేలు, సచివాలయ సిబ్బంది తీర్మానించి పనులు ఆమోదిస్తున్నారు. ఆయా పనుల లైన్ ఎస్టిమేషన్, ఫొటో, ఎమ్మెల్యే బృందం చేసిన తీర్మానం జిల్లా కలెక్టర్‌కు చేరుతోంది. కలెక్టర్ ఆమోద ముద్ర వేయగానే పనులు ప్రారంభిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఇప్పటికే సింహభాగం పనులు పట్టాలెక్కాయి. కొన్నిచోట్ల పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.



నిడదవోలు నియోజకవర్గం కాపవరంలో మురుగు కాలువ నిర్మాణం

ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారు



గడప గడపకూ వెళుతుంటే ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారు. గతంలో ఎమ్మెల్యేలను కలవాలంటే కష్టంతో కూడుకున్న పనిగా మారేది. ప్రస్తుతం జగనన్న ఇంటి వద్దకే ఎమ్మెల్యేలను పంపుతుంటే ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల విజ్ఞప్తులను అప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. అత్యవసరమైన పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

– తానేటి వనిత, హోంమంత్రి

గ్రామాల అభివృద్ధికి దోహదం



సచివాలయానికి రూ.20 లక్షల నిధుల కేటాయింపు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు దోహదం చేస్తాయి. గడప గడపకూ ప్రభుత్వం కింద మా నియోజకవర్గంలో పనులు ప్రారంభించాం. త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తున్నాం. డ్రెయిన్లు, రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నాం.

– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే రాజానగరం

రాష్ట్రంలో ఐదో స్థానం



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ నిర్వహణలో మన జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచింది. కొన్ని అంశాల్లో మొదటి స్థానం దక్కించుకుంది. ఇంటింటికీ వెళ్లే కార్యక్రమం యుద్ధప్రాతిపదిన సాగుతోంది. ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పనులకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం.

– డాక్టర్ కె.మాధవీలత, కలెక్టర్

వెంటనే ఆమోదం



గడప గడపకూ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. కలెక్టర్ సూచనల మేరకు ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పనులకు వెంటనే ఆమోదం తెలుపుతున్నాం. పనులు పక్కాగా నిర్వహించేలా పర్యవేక్షణ చేపడుతున్నాం. కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా సాగుతోంది.

– ఎ.ముఖలింగం, సీపీఓ



రాజమహేంద్రవరంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండగను గురువారం జిల్లాలో ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండగ గొప్పదనాన్ని మతగురువులు వివరించారు. రాజమహేంద్రవరంలోని ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

దివ్యాంగుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి



కేక్ కట్ చేస్తున్న దివ్యాంగుల విభాగం నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: దివ్యాంగుల సంక్షేమానికి సీఎం జగన్ అనునిత్యం కృషి చేస్తున్నారని దివ్యాంగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజు అన్నారు. వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ ఆధ్వర్యంలో మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. బందెల కిరణ్ రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలను ఏర్పాటు చేసి దివ్యాంగులకు పార్టీ నాయకులతో సమానంగా స్థానం కల్పించారన్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం దివ్యాంగులకు రూ.3 వేల పింఛను మంజూరు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,750 మూడు చక్రాల మోటారు సైకిళ్లు పంపిణీ చేశారని తెలిపారు. దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తానన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇప్పటివరకూ తన పార్టీలో అనుబంధం విభాగాలను ఏర్పాటు చేయలేక పోయారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మద్దాల అను, పార్టీ దివ్యాంగుల విభాగం నగర అధ్యక్షుడు సభ్యుల విజయదుర్గారెడ్డి, నిషా, నాగులపల్లి లక్ష్మణరావు, బాబ్జీ, పెనుబోతుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తొలకరి వ్యాధులపై అప్రమత్తం

- ఈ ఆరు నెలలూ సీజనల్ వ్యాధులకు ఆస్కారం
- నియంత్రణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు
- అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు సూచన



అగ్నిగుండంలా అట్టుడికిన జిల్లా రుతుపవనాల పుణ్యమా అని చల్లబడుతోంది. జిల్లాలో అక్కడక్కడా చిన్నపాటి వర్షాలు కురుస్తున్నాయి. ఈ తరహా వాతావరణం మాటున ఆందోళన కలిగించే వాస్తవం ఉంది. తొలకరి టెన్షన్ 'అటెన్షన్' అంటూ హెచ్చరిస్తోంది. అనేక సూక్ష్మ, అతిసూక్ష్మ క్రిముల వృద్ధి, క్రియాశీలత్వానికి ఈ వాతావరణం దోహదపడటమే కాక సీజనల్ వ్యాధులు ప్రబలేలా చేస్తుంది.

కాకినాడ క్రైం: రుతువుల మార్పులతో విజృంభించే సీజనల్ వ్యాధులు జూన్ నుంచి నవంబర్ వరకు కొనసాగుతాయి. నీటి కాలుష్యం, కీటకాలు, క్రిముల వృద్ధి , చలనం వల్ల సీజనల్ వ్యాధులు సంక్రమిస్తాయి. మలేరియా, డెంగీ, ఫైలేరియా, మెదడువాపు, డయేరియా, టైఫాయిడ్‌లను సీజనల్ వ్యాధులుగా పరిగణిస్తారు. వీటి నియంత్రణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఈ ఏడాది కూడా ప్రత్యేక కార్యాచరణతో సిద్ధమైంది. కాకినాడలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇద్దరు ప్రత్యేకాధికారులు కొనసాగుతున్నారు. జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు కీటక జనిత వ్యాధుల నిర్వహణాధికారి కాగా, వాటర్న్ బార్న్ విభాగానికి నిర్వహణాధికారిగా డాక్టర్ బందారు రవికుమార్ సాంక్రమిక వ్యాధులు నివారణాధికారి హోదాలో కొనసాగుతున్నారు.

వెక్టార్ బార్న్ ఇలా..

కీటక జనిత వ్యాధుల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు తెలిపారు. అనాఫిలిస్ దోమ మాధ్యమంగా మలేరియా ప్లాస్మోడియం ప్రోటోజోవా ద్వారా సంక్రమిస్తుందన్నారు. డెంగీ, చికెన్ గున్య ఈడిస్ దోమ మాధ్యమంగా డెంగీ కీటకం ద్వారా వ్యాపిస్తాయని తెలిపారు. పలుమార్లు ప్రాణాపాయంగా మారే అవకాశం ఉన్న రోగాల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతూ నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు.

చర్యలు ఇవీ..

పల్లపు ప్రాంతాలను పూడ్చడం, మురికి కాల్వల్లో పూడిక తీత, చెరువులతో సహా జలవనరులన్నింటినీ పరిశుభ్రంగా నిర్వహించడం, తాత్కాలిక, శాశ్వత వాటర్ బాడీలైన ట్యాంకులు, నీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడం, ఇళ్లల్లో దోమ తెరల ఏర్పాటు, డ్రోన్‌ల ద్వారా స్ప్రే పిచికారీ, ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేల ద్వారా ఇళ్లల్లో స్ప్రే చల్లడం ద్వారా కీటక జనిత సీజనల్ వ్యాధుల నివారణ చేపడుతున్నామని మలేరియా నివారణ అధికారి భాస్కరరావు తెలిపారు. వాటర్ బోర్న్ వ్యాధులు నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నట్లు సాంక్రమిక వ్యాధులు నివారణాధికారి డాక్టర్ బందారు రవి కుమార్ తెలిపారు.

నివారణ చర్యలు

సాలమనెల్లా టైఫీ బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందే టైఫాయిడ్‌తో పాటు డయేరియా నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతరంగా పరిణమిస్తాయని డాక్టర్ రవి కుమార్ తెలిపారు. బ్యాక్టీరియా కారకం ద్వారా కాలుష్యానికి గురయ్యే నీటిని సేవించడం వల్ల ఈ వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. నీటి జనిత సాంక్రమిక వ్యాధుల నివారణ కోసం పటిష్ట చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మలేరియా నివారణ కోసం చేపడుతున్న ఫ్రై డే డ్రై డే బహుళ ప్రయోజనాలను ఇస్తుందన్నారు. మంచి నీటి నిల్వల్లో పెరిగే బ్యాక్టీరియా నివారణకు క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ఫ్రిజ్ వెనుక పాత్రలో నీరు, కొబ్బరి చిప్పలు, టైర్లలో నీరు, పూల కుండీలు, నీటి కుంటల్లో లార్వా వృద్ధి చెంది సాల్మొనెల్లా టైఫీని విస్తరిస్తాయన్నారు. వీటి నివారణకు క్లోరినేషన్ ప్రక్రియను చేపట్టాలన్నారు.

డెంగీతోనే ఆందోళన



ఏటా జూన్ నుంచి డెంగీ కేసుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. గతేడాది కేసులు నమోదైతే ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకూ 54 నమోదయ్యాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లక్షణాలు కనిపిస్తే తక్షణమే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఫ్యామిలీ డాక్టర్‌ను సంప్రదించాలి. ప్రతి ఆరోగ్య కేంద్రంలోనూ మందులు, పరీక్షల కోసం కిట్లు సిద్ధం చేసి ఉంచాం. ఈ నెలంతా మలేరియా నివారణ మాసోత్సవం నిర్వహిస్తున్నాం. జూలై నెల అంతా డెంగీ నివారణ మాసోత్సవ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– డాక్టర్ రోణంకి రమేష్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా

ప్రజలకు సూచనలు

- నీటి కుంటలను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలి.
- కొబ్బరి బొండాలు, చిప్పల వ్యర్థాలు, పాడు బడ్డ టైర్లు ఇంటికి సమీపంలో ఉంచకూడదు.
- వర్షాకాలంలో పరిశుభ్రత పాటించాలి.
- దోమలు ప్రవేశానికి ఇంటిలో ఆస్కారం ఇవ్వకుండా ఈగలు వాలని వేడి ఆహారాన్ని మాత్రమే తినాలి.
- దోమ తెరలు విరివిగా ఉపయోగించాలి.

జర్మనీలో నర్సులుగా ఉద్యోగావకాశాలు

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), టీకేఏటీ ఇంటర్నేషనల్, ఏపీఎస్ఆర్‌టీ సంయుక్త ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ చదువుకున్న అభ్యర్థులకు జర్మనీలో స్టాఫ్‌నర్సులుగా ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. 20 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసు, సాధారణ ఆసుపత్రులలో రెండేళ్లలో అనుభవం, జర్మన్ భాష నేర్చుకోవడానికి ఆసక్తి ఉండాలన్నారు. తప్పనిసరిగా నర్సింగ్ గ్రాడ్యుయేట్ (బీఎస్సీ నర్సింగ్) అయి ఉండాలన్నారు. విజయవాడలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే బీ1 స్థాయి జర్మన్ భాష శిక్షణ కోసం నిర్బంధ ఉచిత ఆన్‌లైన్ తరగతులకు హాజరుకావాలన్నారు. బీ1 స్థాయి ఉత్తీర్ణత సాధించిన తర్వాత జర్మనీలో పనిచేయడానికి ఆఫర్ లెటర్ ఇస్తారన్నారు. రెజ్యూమ్‌తో పాటు ఎడ్యుకేషనల్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు, అనుభవ ధ్రువీకరణ పత్రం ఉండాలన్నారు. జర్మనీకి విమాన చార్జీలతో పాటు ఉచిత ఆహారం, వసతి, మొదటి ఆరునెలల వరకూ ప్రారంభ జీతం నెలకు 1000 యూరోలు (రూ.89 వేలు) ఇస్తారన్నారు. ఆరు నెలల పాటు జర్మనీలో బీ2 సర్టిఫికేషన్ కోసం శిక్షణ ఇస్తారన్నారు. అందులో ఉత్తీర్ణత సాధిస్తే నెలకు జీతం దాదాపుగా రూ.2500 యూరోలు వరకూ పెరుగుతుందన్నారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో శిక్షణ తరగతులు జూలై ఒకటి నుంచి ప్రారంభమవుతాయన్నారు. శుక్రవారం లోపు రిజిస్ట్రేషన్‌కు చేసుకోవాలన్నారు. www.apssdc.in/home/onlineProgramRegistrationలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు రెజ్యూమ్‌ని helpline@apssdc.in మెయిల్ ఐడి లేదా కాల్‌సెంటర్ 99888 53335 నంబర్‌కు షేర్ చేయవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

ఆడిట్ గడువు పెంచండి

- సొసైటీలకు నేటితో ముగియనున్న వైనం
- జూలై 15 వరకు పెంచాలని తీర్మానం



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయం

సాక్షి అమలాపురం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీలు) గత ఆర్థిక సంవత్సర ఆడిట్‌ను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వులు సంఘాలలో కలకలం సృష్టిస్తున్నాయి. సెక్షన్ 50 (4) ఆఫ్ ఏపీసీఎస్ 1964 ప్రకారం ఈ నెలాఖరు నాటికి ఆడిట్ పూర్తి చేయాలని సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో సెప్టెంబర్, అక్టోబర్ నెలాఖరు వరకు ఆడిట్ పూర్తి చేసేందుకు గడువు ఇచ్చేవారు. కానీ ఈ ఏడాది అసాధారణంగా జూన్ నెలాఖరు నాటికి ఆడిట్ పూర్తి చేయమనడంతో పీఏసీఎస్‌ల అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో డీసీసీబీ పరిధిలో మొత్తం 302 సంఘాలు ఉన్నాయి. గడువు తగ్గించడం వల్ల చాలా సంఘాలలో ఆడిట్ పూర్తికాలేదు. బుధవారం కాకినాడలో జరిగిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజన సభలో పీఏసీఎస్ చైర్మన్‌లు, సీఈవోలు గడువు కావాలని పట్టుబట్టారు. మహాజన సభ ఆడిట్ పూర్తి చేసేందుకు జూలై 15 వరకు గడువు పెంచాలని తీర్మానం చేస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపించింది. ప్రభుత్వం అనుమతిస్తే ఆడిట్ పూర్తి చేసేందుకు గడవు లభించనుంది.

మనస్థాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

మామిడికుదురు: కొడుకు తనను వేరే ఇంట్లో ఉంచాడన్న మనస్థాపంతో మొగలికుదురు గ్రామానికి చెందిన బిళ్ల సరస్వతి (82) ఆత్మహత్య చేసుకుందని నగరం ఎస్సై షేక్ జానీబాషా గురువారం తెలిపారు. ఈ నెల 26వ తేదీ రాత్రి నుంచి సరస్వతి కనిపించడం లేదంటూ ఆమె మనమడు ధర్మతేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొదట అదృశ్యం కేసు నమోదు చేశామన్నారు. 28వ తేదీన ఆమె ఇంటి పక్కనే ఉన్న పంట కాలువలో శవమై కనిపించిందని ఎస్సై చెప్పారు. ఇంట్లో తన మాటే చెల్లుబాటు కావాలని, కొడుకు తనను ఇంట్లో కాకుండా వేరే ఇంట్లో ఉంచాడన్న మనస్థాపంతో ఇంటి పక్కనే ఉన్న పంట కాలువలో దూకి సరస్వతి ఆత్మహత్య చేసుకుందన్నారు. పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

రోజుకో పదం.. అందుకో ఆంగ్ల పథం

- ఇంగ్లిషు అభ్యసనే లక్ష్యంగా ముందుకు
- ప్రతి 15రోజులకు ఒకసారి విద్యార్థులకు పరీక్ష
- పక్కాగా అమలుకు విద్యాశాఖ ఆదేశాలు



రాయవరం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్ల పదాలు నేర్పిస్తున్న టీచరు సత్యనారాయణమ్మ

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియంకు ప్రాధాన్యం పెరిగింది. గతంలో కేవలం ఉన్నత పాఠశాలల్లో సక్సెస్ స్కూళ్లలో మాత్రమే ఇంగ్లిషు మీడియం ఉండగా, ఇప్పుడు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కూడా పూర్తి స్థాయిలో ఇంగ్లిషు మీడియం ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఇంగ్లిషుపై విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలను పోగొట్టేందుకు 'లెర్న్ ఏ వర్డ్ ఏ డే' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. లాంగ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేసింది. ఈ ఏడాది కూడా అమలుకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 19వ తేదీ నుంచి పాఠశాలల్లో 'లెర్న్ ఏ వర్డ్ ఏ డే' ప్రారంభించారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రతి రోజూ ఆంగ్ల పదాలను విద్యార్థులకు నేర్పిస్తున్నారు. అయితే విద్యార్థులు 'లెర్న్ ఏ వర్డ్ ఏ డే'లో ఆంగ్ల పదాలు ఎంతవరకు నేర్చుకున్నారు? ఏ మేరకు పదాలను అవగాహన చేసుకున్నారన్న విషయం తెలుసుకునేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రతి 15 రోజులకు ఒకసారి పరీక్షను కూడా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం వలన విద్యార్థులకు రీడింగ్, రైటింగ్ స్కిల్స్ అభివృద్ధి చెందుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

నాలుగు దశల్లో..

ప్రతి రోజు పాఠశాల అసెంబ్లీలోనే 'లెర్న్ ఏ వర్డ్ ఏ డే' ప్రోగ్రామ్‌లో ఆరోజు చెప్పాల్సిన పదాలను విద్యార్థులకు పరిచయం చేస్తున్నారు. అనంతరం ఫస్ట్ పీరియడ్‌లో విద్యార్థులకు కేటాయించిన నోట్సులో పదాలను రాయిస్తున్నారు. ఆ పదాలతో సొంత వాక్యాలను తయారు చేసి వారితో చదివిస్తున్నారు. ఒకటి, రెండు తరగతులను ఒకటవ స్థాయి, 3,4,5 తరగతులను రెండు, 6,7,8 తరగతులను మూడు, 9,10 తరగతులను నాల్గవ స్థాయిగా విభజించారు. ప్రతి రోజూ కొన్ని పదాలను విద్యార్థులకు చెప్పి సాధన చేయించారు. తొలి దశలో పదాల ఉచ్చారణ, మౌఖిక అభ్యసనం, రెండవ దశలో స్పెల్లింగ్ గేమ్, మూడవ దశలో డిక్షనరీ సహకారంతో భాషాభాగాల గుర్తింపు, నాల్గవ దశలో సమాన అర్థాలను, వ్యతిరేక పదాలను కనుగొనడం నేర్పిస్తున్నారు. ప్రతిరోజూ ఒక పదాన్ని బోర్డుపై రాసి, విద్యార్థులతో రాయిస్తున్నారు. ఈ కార్యక్రమం నిమిత్తం 100 పేజీల పుస్తకాన్ని కేటాయించారు. ప్రతి 15రోజులకు ఒకసారి విద్యార్థులు సాధన చేసిన పదాలపై స్పెల్ బీ పేరుతో డిక్టేషన్ నిర్వహిస్తున్నారు. ఫలితాలను మదింపు చేసి విద్యార్థులకు అవసరమైన సూచనలు ఇస్తున్నారు.

1,588 పాఠశాలల్లో..

లెర్న్ ఏ వర్డ్ ఏ డే కార్యక్రమం ఈ నెల 19 నుంచి ప్రారంభం కాగా, విద్యా సంవత్సరం ముగిసే వరకు కొనసాగనుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో వివిధ ప్రభుత్వ యాజమాన్యాల కింద 1,275 ప్రాథమిక, 78 ప్రాథమికోన్నత, 235 ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 1,2 తరగతులు 32,658 మంది, 3,4,5 తరగతులు 65వేలు, 6,7 తరగతులు 44,561 మంది, 8,9,10 తరగతులు 61,795 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరందరికీ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

చాలా ప్రయోజనం



'లెర్న్ ఏ వర్డ్ ఏ డే' ప్రోగ్రామ్ విద్యార్థులకు చాలా ప్రయోజనకరం. ఆంగ్లంపై విద్యార్థులు పట్టు సాధించేందుకు ఈ విధానం చక్కని మార్గం. విద్యాకానుకలో భాగంగా విద్యార్థులకు డిక్షనరీలు కూడా అందజేశాం. ఆంగ్లభాషా పదాలపై పట్టు, మాట్లాడే నైపుణ్యం పెంపొందించుకునేందుకు డిక్షనరీల వినియోగం ఉపకరిస్తుంది.

– జి.నాగమణి, ప్రాంతీయ సంయుక్త తనిఖీ అధికారి, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

పర్యవేక్షణలో భాగం చేశాం



పాఠశాలల్లో విద్యార్థులు ప్రతి రోజూ ఒక ఆంగ్ల పదం నేర్చుకునే విధంగా ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా పాఠశాలల్లో అమలు చేస్తున్నాం. ప్రతి పర్యవేక్షణ అధికారి 'లెర్న్ ఎ వర్డ్ ఎ డే' కార్యక్రమం అమలును తనిఖీ చేసేలా పర్యవేక్షణలో భాగం చేశాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, కోనసీమ జిల్లా

టిడ్కో భవనాల వద్ద రూ.25 లక్షల ఐరన్ చోరీ

కేసు నమోదు

అల్లవరం: అమలాపురం పట్టణ ప్రజలకు అల్లవరం మండలం బోడసకుర్రు టిడ్కో భవనాల వద్ద అదనపు లే అవుట్‌లో జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ఐరన్‌ని హౌసింగ్ శాఖకు చెందిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చోరీ చేసినట్టు గుర్తించారు. అల్లవరం ఎస్సై శ్రీను నాయక్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం బోడసకుర్రు టిడ్కో భవనాల వద్ద జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి 46 టన్నుల 100 కేజీల ఇనుము హౌసింగ్ అధికారులు దిగుమతి చేశారు. నాలుగు నెలలుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న అంబాజీపేట మండలం పొలగుమ్మి గ్రామానికి చెందిన సర్లె్ల ఏడుకొండల వెంకటరమణ తరుచుగా ఆ ఇనుము చోరీకి పాల్పడ్డాడు. హౌసింగ్ అధికారులకు అనుమానం వచ్చి లెక్కించగా 36 టన్నుల190 కేజీల ఐరన్ చోరీ జరిగినట్లు గుర్తించారు. కేవలం 99 కేజీల ఐరన్ మాత్రమే మిగిలినట్లుగా అధికారులు లెక్కలు తేల్చారు. చోరీ చేసిన ఐరన్ ఖరీదు రూ.25 లక్షల 34 వేలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ చోరీపై అమలాపురం మున్సిపల్ హౌసింగ్ అధికారి శ్రీధర్ అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో అల్లవరం ఎస్సై ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని ఏడుకొండలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

- 23.7 టన్నుల బియ్యం, లారీ స్వాధీనం
- ఐదుగురిపై కేసు నమోదు



కొవ్వూరులో అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం లారీ

కొవ్వూరు: అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం గామన్ ఇండియా బ్రిడ్జి సమీపంలో విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ అధికారుల సంయుక్త తనిఖీలో పట్టుకున్నారు. లారీని స్వాధీనం చేసుకుని పట్టణ పోలీసు స్టేషన్‌కి తరలించినట్లు సీఎస్ డీటీ జి.బాపిరాజు తెలిపారు. లారీ డ్రైవర్ బత్తిన కొండలు, లారీ యాజమాని మీరా వలీ, బియ్యం లోడు పురమాయించిన సైదులు, లారీకి ఎస్కార్ట్‌గా పనిచేస్తూ విలేకరులుగా చెప్పుకుంటున్న మరో ఇద్దరిపై ఫిర్యాదు చేసినట్లు సీఎస్ డీటీ తెలిపారు. ఈ లారీ తెలంగాణలోని ఖమ్మం జిల్లా కుచిమంచి గ్రామంలో బియ్యం లోడు వేసుకుని వస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. లారీ యాజమాని మీరావలీ నల్గొండకు చెందినవాడన్నారు. డ్రైవర్ కొండలు ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం గండివల్లి గ్రామానికి చెందిన వాడన్నారు. బియ్యం లోడు పంపిన సైదులు వత్సవాయికి చెందిన వాడ న్నారు. స్వాధీనం చేసుకున్న లారీలో 23.7 టన్నుల బియ్యం పట్టణ పోలీసులకు అప్పగించామన్నారు. ఈ దాడుల్లో స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.17లక్షలు ఉంటుందని సీఎస్‌డీటీ తెలిపారు. ఈ బియ్యం అన్‌లోడింగ్ ఎక్కడ అనేది లారీడ్రైవర్ తెలియదంటున్నారన్నారు. కొవ్వూరు వచ్చిన తర్వత ఫోన్ చేయాలని సూచించినట్లు చెబుతున్నారని సీఎస్ డీటీ తెలిపారు. విజిలెన్స్ సీఐ సత్య కిషోర్, మైనింగ్ శాఖ తరపున జియాలజిస్టు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

ఇల వైకుంఠంలా రత్నగిరి



సత్యదేవుడు, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు



దర్బారు మంటపంలో భక్తుల సందడి

- దర్బారు మంటపంలో విష్ణుమూర్తిగా సత్యదేవుడు
- వేలాదిగా స్వామివారిని దర్శించిన భక్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని సన్నిధిలో తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి దర్బారు మంటపంలో సర్వాంగ సుందరంగా అలంకరించిన నిలువెత్తు విష్ణుమూర్తి భక్తులకు దర్శనమిచ్చి ఇల వైకుంఠం లా రత్నగిరి ప్రకాశించింది. నాలుగు భుజాలు కలిగి వాటిలో శంఖు చక్రాలు, గద, శార్ఙం ధరించి వక్షస్థలం లో మహాలక్ష్మి తో విష్ణుమూర్తి భక్తులను అలరించారు.

దర్బారు మంటపంలో సత్యదేవుని ఉత్సవమూర్తుల దర్శనాలు ప్రారంభం

విశాలంగా, వాస్తుకు అనుకూలంగా తీర్చిదిద్దిన దర్బారు మంటపంలో సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తుల దర్శనం తొలి ఏకాదశి, గురువారం ఉదయం నుంచి ఘనంగా ప్రారంభమైంది. ఉదయం ఎనిమిది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఒకవైపు నిలువెత్తు విష్ణుమూర్తి, మరోవైపు సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తులు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తుల రద్దీ కారణంగా సత్యదేవుని గర్భాలయంలో సత్యదేవుడు, అమ్మవారిని ఎక్కువ సేపు తిలకించే అవకాశం లేని భక్తులు దర్బారు మంటపంలో స్వామి, అమ్మవార్లను చాలాసేపు తిలకించారు. స్వామివారిని దర్శించిన భక్తులకు రవ్వ కేసరి ప్రసాదం పంపిణీ చేశారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ దర్బారు మంటపంలో విష్ణుమూర్తి, సత్యదేవుడు, అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు.

మహిళల లలితా, విష్ణు సహస్రనామ పారాయణ

దర్బారు మండపంలో సత్యదేవుడు, అమ్మవారి పాదాల చెంత మహిళలు లలిత, విష్ణు సహస్రనామావళి పారాయణం చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. అనంతరం స్వామి, అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠీ, గంగాధరభట్ల గంగబాబు, శివ, యనమండ్ర శర్మ, పురుషోత్తం, రమేష్, ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి, అర్చకులు దత్తాత్రేయశర్మ, సుధీర్, రామ్‌కుమార్, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడు రవిశర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యదేవుని ఆలయం, దర్బారు మంటపం, ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.



దర్బారు మంటపంలో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన విష్ణుమూర్తి

స్వాహా సొమ్ము లెక్క తేల్చారు

వీవోఏపై కేసు నమోదు



కొంకాపల్లి యూనియన్ బ్యాంకులో విచారణ చేస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

అమలాపురం రూరల్: పేరూరులో డ్వాక్రా సంఘాల నుంచి బ్యాంకు సేవా కేంద్రం ద్వారా కట్టించుకున్న రుణాల సొమ్ములో రూ.44.89 లక్షలు ఓ వీవోఏ స్వాహా చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు లెక్క తేల్చారు. ఈ ఘటనపై డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు అమలాపురం పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. 30 స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెందిన స్త్రీనిధి, బ్యాంక్ రుణాల వాయిదాల సొమ్ములో రూ.44.89 లక్షలను పేరూరు పంచాయతీ చింతపల్లిపాలెం గ్రామ సంఘం వీవోఏ కనకదుర్గ స్వాహా చేసినట్లు అధికారులు విచారణలో తేల్చారు. ఆయా సంఘాల సభ్యుల రుణాల వాయిదాలు ముగిసినా అప్పు తీరకపోవడంతో బ్యాంక్ అధికారుల నుంచి వారిపై ఒత్తిడి పెరిగింది. దీంతో బాధిత డ్వాక్రా సంఘాల సభ్యులు ఇటీవల స్పందనలో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని ఆయన ఆదేశించారు. డీఆర్‌డీఏ అధికారులు కొంకాపల్లి యూనియన్ బ్యాంక్‌కు వెళ్లి మేనేజర్‌తో కలసి అక్కడ లెక్కలు తేల్చారు. పేరూరులో మహిళా సంఘాల బ్యాంకు పుస్తకాలను పరిశీలించి వారి వద్ద నుంచి వివరాలు తీసుకున్నారు. వీవోఏ కనకదుర్గ సుమారు రూ.44.89 లక్షలు వాడుకున్నట్లు గుర్తించారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాలతో కనకదుర్గపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ అంబికా ప్రసాద్ చెప్పారు.

ఆసక్తికర విషయాలెన్నో..

కొంకాపల్లి యూనియన్ బ్యాంక్‌లో అధికారులు విచారణ చేయగా ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. పేరూరులో రామాంజనేయ సంఘం నుంచి రూ.1.50 లక్షల శ్రీనిధి సొమ్మును వీవోఏ తన పెద్ద కుమార్తె అకౌంట్‌కు రూ.లక్ష, రెండో కుమార్తెకు రూ.50 చొప్పున వేసింది. మళ్లీ ఆ మొత్తాన్ని గూగుల్ పే ద్వారా ఓ అల్లుడి ఖాతాకు వేసినట్లు అధికారులు నిర్ధారించారు. వీవోఏ తన స్కైపింగ్ (నగదు బదిలీ మెషీన్) ద్వారా కూడా సంఘం సొమ్మును నచ్చిన వారి ఖాతాలకు జమ చేసినట్లు అధికారుల విచారణలో తేలింది.

సరిహద్దు వివాదం కేసులో ఆరు నెలల జైలు

గోకవరం: కామరాజుపేటలో సరిహద్దు గొడవలో నమోదైన కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలలు జైలు శిక్ష పడిందని కానిస్టేబుల్ మణికంఠ గురువారం తెలిపారు. ఇక్కట్ల గంగారావు, తాడిపర్తి వీరవెంకట సత్యనారాయణల మధ్య ఇంటి సరిహద్దు గొడవ జరగడంతో ఇక్కట్ల గంగారావు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరం ఒకటవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో వాదనల అనంతరం ఇక్కట్ల గంగారావుపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారన్నారు. పీపీ మహాలక్ష్మి వాదనలు వినిపించారన్నారు.

దాడి కేసులో ముగ్గురికి ఏడాది జైలు

కొత్తపేట: పెళ్లికి వెళ్లి తిరిగి వస్తున్న ఇద్దరిపై, నలుగురు వ్యక్తులు దాడి చేసి దుర్భాషలాడిన ఘటనలో రాజమహేంద్రవరం ఎస్సీ ఎస్టీ కోర్టు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు కొత్తపేట డీఎస్పీ కె.వెంకటరమణ, రావులపాలెం సీఐ రజనీకుమార్ గురువారం తెలిపారు. 2015 జనవరి 29వ తేదీన రాత్రి 8 గంటల సమయంలో కొత్తపేట మండలం పలివెల గ్రామం చిన్నపేటకు చెందిన నక్క రాజేష్, గొల్లపల్లి శ్రీను కలిసి ఆటోలో పెళ్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. చిన్నపేట సమీపంలో పలివెల, శేరేపాలెంకు చెందిన మల్లవరపు కనకరాజు అలియాస్ బాబీ, మల్లవరపు నాగభూషణం అలియాస్ బొజ్జకాపు, మల్లవరపు అర్జునరావు, మల్లవరపు శ్రీను అలియాస్ పచ్చళ్ళ శ్రీను వారిని ఆపి వారిపై దుర్భాషలాడుతూ కులం పేరుతో తిట్టి కర్రలు, డ్రింక్ బాటిల్స్‌తో దాడి చేసి, గాయపరిచారు. ఈ ఘటనపై అప్పటి ఏఎస్ఐ ఎ.గారగారావు కేసు నమోదు చేయగా అప్పటి డీఎస్పీ ఎల్.అంకయ్య దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదన అనంతరం ముద్దాయిలైన కనకరాజు, నాగభూషణం, అర్జునరావుకు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ జడ్జి ఎం.నాగేశ్వరావు తీర్పునిచ్చారన్నారు. ఈ కేసులో నాలుగో ముద్దాయి శ్రీను అలియాస్ పచ్చళ్ళ శ్రీను వాదనల సమయంలో మృతి చెందినట్టు తెలిపారు.

జనం లేక బస్సుయాత్ర వెలవెల

- కానరాని తెలుగు తమ్ముళ్ల సందడి
- చంద్రబాబును నమ్మని ప్రజలు



రాజమహేంద్రవరంలోని సీతంపేట వద్ద కార్యకర్తలు లేక వెలవెలబోతున్న బస్సుయాత్ర

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో తెలుగుదేశం నాయకులు నగరంలో గురువారం చేపట్టిన బస్సుయాత్ర వెలవెల బోయింది. బస్సుయాత్రతో నగరంలో తెలుగుదేశం క్యాడర్ బలాన్ని చూపిద్దామనుకున్న నాయకులకు చుక్కెదురైంది. అట్టహాసంగా ప్రారంభించిన ఈ యాత్రలో తెలుగు తమ్ముళ్ల సందడి కానరాలేదు. గురువారం ఉదయం చైతన్య యాత్ర రథానికి పేపరు మిల్లు ఎదురుగా ఉన్న 45వ డివిజన్‌లో వాంబే గృహాల వద్ద దిష్టి తీసి పూజలు చేసి ప్రారంభించారు. పార్టీ నాయకులు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆదిరెడ్డి అప్పారావు, కేఎస్ జవహర్, నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి, పెందుర్తి వెంకటేష్, ఆదిరెడ్డి వాసు తదితరులు పాల్గొన్నారు. పుష్కరాల రేవు, వై.జంక్షన్ బీసీ బాలుర వసతి గృహం, కంబాల చెరువు నుంచి స్వతంత్ర ఆసుపత్రి మీదుగా మూలగొయ్యి ఎన్టీఆర్ విగ్రహం వద్దకు బైక్ ర్యాలీని నిర్వహించారు. బస్సుకు ముందు కొన్ని బైక్‌లతో కార్యకర్తలు సాగారు.

టీడీపీకే గ్యారంటీ లేదు

చంద్రబాబు, టీడీపీతో పెట్టుకుంటే భవిష్యత్తుకు గ్యారంటీ లేదని జనం అనుకుంటున్నారు. గత ఎన్నికల్లో రాష్ట్రమంతా ఫ్యాన్ హవా కొనసాగితే రాజమహేంద్రవరం అర్బన్‌లో మాత్రం ఆ పార్టీ అభ్యర్థి విజయం సాధించారు. మూడుసార్లు నగరపాలక సంస్థ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆ ధీమాతోనే అర్బన్‌లో తమకు ఎదురులేదని భావిస్తున్న టీడీపీకి ఈ బస్సుయాత్ర చేదు ఫలితం మిగిల్చింది. యాత్ర కాస్తా తుస్సుమనడంతో నాయకులు డీలా పడ్డారు. మూలగొయ్యిలో బహిరంగ సభకు జన సమీకరణ చేసి నడిపించారు.

ఎంఈవో-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

రాయవరం: మండల విద్యాశాఖాధికారి పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఈ మేరకు షెడ్యూల్ విడుదల చేశారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులతో ఎంఈవో-1 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఎంఈవో-1 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్లకు పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల్లో సూచించారు. ఆయా రీజియన్ పరిధిలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల నుంచి నియామకాలు చేపట్టాల్సి ఉంది. 1:2 రేషియో ప్రకారం సీనియారిటీ జాబితాను తయారు చేస్తారు. శుక్రవారం సీనియారిటీ జాబితాను తయారు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జూలై 2వ తేదీన పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. కౌన్సెలింగ్‌లో ఎంఈవో-1 కోరుకున్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు జూలై 3న వారు కోరుకున్న మండలాల్లో చేరాల్సి ఉంటుంది. రీజియన్-2 పరిధిలో 99 ఎంఈవో పోస్టులు ఖాళీలుండగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 27 పోస్టులను భర్తీ చేయనున్నట్లు సమాచారం.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గోకవరం: మండలంలో కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో పడి దొంగలు నగదు దోచుకెళ్లారు. దేవీపట్నంకు చెందిన పాలిశెట్టి శివరామకృష్ణ ఆర్అండ్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కుమారుడి చదువు నిమిత్తం ఇంట్లో నగదు ఉంచి బుధవారం రాజమహేంద్రవరం వెళ్లాడు. అర్ధరాత్రి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో పాటు బీరువాలో ఉంచిన రూ.2.50 లక్షలు కనిపించలేదు. రాజమహేంద్రవరం నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గోకవరం ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపారు.